క్లుప్తంగా

సిటీ బస్సులు నడపండి

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణంలో సిటీ బస్సులు నడపాలని పలువురు ప్రయాణికులు కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. డిపో మేనేజర్ సుజాత సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రయాణికుల నుంచి డిపో పరిధిలోని ఆర్టీసీకి సంబంధించిన సూచనలు, ఫిర్యాదులను ఫోన్ ద్వారా స్వీకరించారు. మహబూబ్‌నగర్ నుంచి కారుకొండకు, మహబూబ్‌నగర్ నుంచి దివిటిపల్లి వరకు బస్సులు నడపాలని, అదేవిధంగా గుడిగండ్లకు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరగా పరిశీలిస్తామని డీఎం సమాధానమిచ్చారు.

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: రియల్ ఎస్టేట్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌ను వారి నివాసంలో పూలమాలలు, శాలువాలతో చైర్మన్‌ను సత్కరించారు. రియల్ ఎస్టేట్స్ ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవికిరణ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మహమూద్, పీటర్, రామకృష్ణ, ఖాజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడి నియామకం

అడ్డాకుల: దేవరకద్ర నియోజకవర్గం కాంగ్రెస్ సేవాదల్ అధ్యక్షుడిగా భూత్పూర్ మండలం కప్పెటకు చెందిన వేణుకుమార్‌రెడ్డిని నియమించినట్లు గురువారం ఆయన ప్రకటనలో తెలిపారు.

అక్రమ బ్లాస్టింగ్‌లపై ఫిర్యాదు

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట శివారులో చేపట్టిన అక్రమ బ్లాస్టింగులపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ అనిల్‌రెడ్డి, మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈనెల 23న సర్వే నంబర్ 112లోని ప్రభుత్వ భూమిలో హైదరాబాద్‌కు చెందిన సుదర్శన్‌రెడ్డి అక్రమంగా బ్లాస్టింగ్ చేయించాడని బుధవారం కలెక్టర్, ఆర్డీఓ, ఫారెస్టు కార్యాలయం, మూసాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అక్రమ బ్లాస్టింగుల వల్ల వన్యప్రాణులకు ప్రమాదం పొంచి ఉందని, బ్లాస్టింగ్ చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మూసాపేట ఎస్‌ఐ కె.సుజాత గురువారం మాట్లాడుతూ.. బ్లాస్టింగ్‌పై ఫిర్యాదు చేశారని, విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేటి సమాజంలో కులాలకు తావు లేదు

మిడ్జిల్: నేటి సమాజంలో కులాలక తావు లేదని ప్రజలంతా ఒక్కటేనని ఆర్‌ఐ అంబిక అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఆలయాలలో దేవుళ్లను అన్ని కులాల వారు పూజించుకోవాలని, కులం పేరుతో దూషిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో ప్రజలు కలిసిమెలసి ఉండాలని సూచించారు. సమావేశంలో కార్యదర్శి సాయన్న, శంకర్, వెంకట్‌రెడ్డి, మురళీ, సాయి, యశోద తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రేరణ తరగతులు

హన్వాడ: మండల కేంద్రంలోని బాలాజీ కొండపై పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ప్రముఖ సైకాలజిస్టు లక్ష్మణ్ విద్యార్థులకు 'సమీపిస్తున్న పరీక్షల్లో సాధనా మెళకువలు' అంశంపై ప్రసంగించారు. విద్యార్థులు పరీక్షలను ఎదుర్కొని విజయం సాధించి జీవితంలో ఉత్తమమైన పౌరులుగా ఎదిగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలరాజు, ఎంఈఓ రాజునాయక్, ఎంఎన్‌ఓ వెంకట రాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉదండాపూర్‌కు ఎమ్మెల్యేల రాక

జడ్చర్ల: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు శుక్రవారం మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్‌ను సందర్శించనున్నారు. ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, జీఎంఆర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి ప్రాజెక్ట్‌ను సందర్శించి సమస్యలను తెలుసుకుంటారని నియోజకవర్గం కాంగ్రెస్ కమిటీ ప్రకటనలో తెలిపింది. అదేవిధంగా నిర్వాసితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారని, రిజర్వాయర్ పనుల పురోగతి, అవినీతి, అక్రమాలపై కూడా విచారిస్తారని ప్రకటనలో పేర్కొన్నారు.

స్వీపర్‌కు ఘనంగా వీడ్కోలు

హన్వాడ: మండలంలోని లింగన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్ కావలి హన్మంతుకు గురువారం ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 35ఏళ్లుగా పాఠశాలలో పార్ట్ టైం స్వీపర్‌గా విధులు నిర్వహించినట్లు ఎంపీపీ బాల్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పాఠశాలకు ఆయన చేసిన సేవలను ప్రశంసిస్తూ ఘనంగా వీడ్కోలు పలికారు.

జోరందుకున్న 'ఉపాధి'


మహమ్మదాబాద్ మండలంలో సీసీ రోడ్ల పనులు ప్రారంభిస్తున్న నాయకులు

- లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనుల్లో వేగం
- జిల్లాలో 397 సీసీ రోడ్లకు అనుమతి
- ఉపాధి హామీ పథకం నుంచి రూ.16.23 కోట్లు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో సీసీ రోడ్ల పనులు జోరందుకున్నాయి. ఇటీవల ఉపాధి హామీ పథకం కింద రూ.16.23 కోట్లతో జిల్లాలో 441 పంచాయతీలో ఉండగా, 397 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 నాటికి పూర్తవుతుంది. ఏటా గ్రామాల్లో మెటీరియల్ కంపొనెంట్ కింద సీసీ రోడ్లకు శ్రీకారం చుడుతున్నారు. జిల్లా నుంచి యూనిట్‌గా తీసుకుని మొత్తం ఖర్చులో 60 శాతం కూలీలకు, 40 శాతం సామగ్రి కింద ఖర్చు చేసేలా ప్రణాళికతో నిధులు వెచ్చించాల్సి ఉంటుంది.

గతంలో సర్పంచ్‌లు నిర్మించే వారు..

ఉపాధి హామీ నిధుల నుంచి మంజూరైన సీసీ రోడ్ల పనులు గతంలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో చేపట్టేవారు. వారి పదవి కాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమించారు. రోడ్ల నిర్మాణం కోసం ముందస్తుగా పెట్టుబడి పెట్టి పనులు చేయాల్సి ఉంటుంది. ప్రత్యేకాధికారులు కావడంతో రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వస్తారా? తమకు ఎందుకులే అని వదిలేస్తారా? అని అనుమానాలు చాలా చోట్ల వ్యక్తం అవుతున్నాయి. నిర్మాణాలు చేపట్టకపోతే నిధులు ల్యాప్స్ కానున్నాయి. ప్రత్యేక అధికారులు రోడ్ల నిర్మాణాలు చేపడుతారా? ఎవరికైనా అప్పగించి పనులు చేపిస్తారా అనే విషయంపై జోరుగా చర్చ సాగుతుంది.

ఈ నెల 15లోగా కోడ్ వచ్చే అవకాశం?

త్వరలో లోక్‌సభ ఎన్నికల జరగనున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 15వ తేదీలోపు ఎప్పుడైన లోక్‌సభ ఎన్నికల షెడ్యుల్ వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాల నుంచి తెలుస్తుంది. అంతలోపు సీసీ రోడ్ల పనులు చేపట్టాలని భావిస్తున్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యేల ద్వారా ప్రతిపాదనల కోసం స్థానిక నాయకులు పరుగులు పెడుతున్నారు. 15 రోజుల ముందు వరకు పనులు పూర్తి చేయాలని భావిస్తున్న నేపథ్యంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తారా లేదా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

పనులు కొనసాగుతున్నాయి..

జిల్లాకు 397 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ఈ పనులు జిల్లాలో కొనసాగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలోపే పనులు పూర్తి కావాల్సి ఉంది. ఈ మేరకు అధికారులకు సూచనలు ఇచ్చాం. అంత వరకు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– నరేందర్‌రెడ్డి, పంచాయతీ రాజ్, ఈఈ

పట్టణంలో సమస్యలను పరిష్కరిస్తాం


కల్వరికొండ వద్ద డ్రైయిన్ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మోతీనగర్ (35వ వార్డు) పరిధిలోని కల్వరికొండ, ఆంజనేయ స్వామి పరిసరాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. అలాగే ఇక్కడి రైల్వే బ్రిడ్జి (అండర్ పాస్) కింద పారుతున్న మురుగు బయటకు వెళ్లేలా చర్యలు చేపడతామన్నారు. స్థానికుల కోరిక మేరకు గురువారం ఆయన ఆయా ప్రాంతాలను కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులుతో కలిసి పరిశీలించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోడ్ ముగిసిన అనంతరం కల్వరికొండ వద్ద సీసీరోడ్డుతో పాటు డ్రెయిన్ నిర్మిస్తామన్నారు.

వైభవంగా గంధోత్సవం



చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లిలో అబ్దుల్ రహమాన్(మాసన్న) ఉర్సులో భాగంగా గురువారం గంధోత్సవం వైభవంగా కొనసాగింది. రాత్రి గ్రామంలోని దర్గా నిర్వాహకుల ఇంటి దగ్గర నుంచి ఊరేగింపుగా మేళతాళాల మధ్య దర్గాకు సమర్పించారు. అనంతరం ఖవాలి గానం చేశారు. కార్యక్రమంలో తాండూర్ కరీంషా దర్గా పీఠాధిపతి సాబేర్ పాషా, దుప్పల్లి అబ్దుల్ రహీం ఉర్సు ఖలందరి రాంచంద్రయ్య దర్గా పీఠాధిపతులు కరుణాకర్‌గౌడ్, రవిగౌడ్, శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ కంపెనీ సందర్శించిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బీపీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 52 మంది విద్యార్థులు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆలోచనతో హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ కంపెనీని సందర్శించారు. ఈమేరకు కంపెనీలో సాఫ్ట్‌వేర్ రంగంపై అవగాహన పెరిగేలా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగులతో విద్యార్థులకు ముఖాముఖీ నిర్వహించారు.

స్కూల్ బస్సును ఢీకొన్న డీసీఎం

హన్వాడ: మండలంలోని చిన్నదర్పల్లి గ్రామం హనుమాన్‌టెంపుల్‌తండా వద్ద విద్యార్థుల కోసం నిలిచి ఉన్న జిల్లా కేంద్రానికి చెందిన చాణిక్య స్కూల్‌బస్సును గురువారం డీసీఎం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులకు మూగగాయాలు కాగా, మరి కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. డీసీఎం డ్రైవర్ ఆంజనేయులుపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

ఆస్పత్రికి ఆక్సిజన్ మిషన్ అందజేత


ఆక్సిజన్ మిషన్ అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

దేవరకద్ర: మండలంలోని వెంకటాయపల్లి పల్లె దవాఖానాకు గుంజ్ స్వచ్ఛంద సంస్థ, ఎస్‌ఆర్‌ఎస్ యువసేన ఆధ్వర్యంలో ఆక్సిజన్ మిషన్‌ను గురువారం అందజేశారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే 160 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ కిట్లను పంపిణీ చేశారు. అలాగే గ్రామంలోని గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సంబంధించిన బుక్స్‌తో పాటు జీకే బుక్స్‌ను అందజేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు, విద్యార్థులకు సేవా కార్యక్రమాల ద్వారా సహకారం అందించాలని ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వరదాసు, రామాంజనేయులు, పరమేష్, ఆంజనేయులు, బంగారికాశన్న, భవాని శంకర్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు గురువారం బహుమతులను అందజేశారు. ఆల రఘుపతిరెడ్డి, ఆల శశివర్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం దేవరకద్ర ప్రీమియర్ లీగ్ సీజన్–3 నిర్వహించారు. రెండు వారాలుగా టోర్నమెంట్‌లో మొత్తం 16 టీంలు పాల్గొన్నాయి. ఫైనల్ విన్నర్ జట్టు పీఅండ్‌ఎస్‌కు ట్రోఫీతో పాటు రూ. 60 వేల నగదు బహుమతిని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అందజేశారు. రన్నర్ జట్టు జేకేఎల్‌ఎస్‌కు రూ.40 వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. అదనంగా ఒక్కో జట్టుకు రూ.10వేలు నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జట్టి నర్సింహారెడ్డి శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, కొండారెడ్డి, కేబీ గౌడ్, ఆంజనేయులు, శివానంద్, భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్, బాల్‌రాజు, యుగంధర్‌రెడ్డి, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్ విడుదల


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రజాపంథా నాయకులు

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా కార్యాలయంలో ఖమ్మంలో జరిగే మహాసభల పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, సీపీఐ ఎంఎల్ పీసీసీ, సీపీఐ ఎంఎల్ ఆర్‌ఐ పార్టీల ఆధ్వర్యంలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మూడు పార్టీలు పోరాటం చేయడానికి ఐక్య వేదికను నిర్వహిస్తున్నాయని తెలిపారు. 3, 4, 5 తేదీలలో జరిగే మహాసభలకు కార్మికులు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సీహెచ్ రాంచందర్, సాంబశివుడు కోరారు. కార్యక్రమంలో కొండారెడ్డి, శివారెడ్డి, రాజు గణేష్, వెంకటయ్య, బాల్‌రాజు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ, నాగదేవతా ప్రతిష్ఠాపన


అలంకరణలో అమ్మవారు


మహోత్సవాలను తిలకిస్తున్న భక్తులు


శిఖర కలశ స్థాపన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రవీంద్రనగర్‌లోగల పోచమ్మదేవి (శీతలాదేవి) ఆలయంలో శిఖర కలశ, నాగదేవతల ప్రతిష్ఠాపన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఉదయం ప్రాతఃకాల పూజలు, ఆవాహిత దేవతా హోమాలు, రత్నన్యాసం పూజలు చేశారు. నారాయణపేటకు చెందిన శక్తిపీఠం వ్యవస్థాపకులు శాంతానంద పురోహిత్ చేతులమీదుగా శిఖర కలశస్థాపన, నాగదేవతా ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. యంత్రస్థాపనం, విగ్రహ ప్రతిష్ఠ, బలిప్రదానం, మహాపూర్ణాహుతి, మహా మంగళ హారతి నిర్వహించారు. స్వామిజీ వేద ఆశీర్వచనం చేశారు. ఈ మహోత్సవాలను భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. ఈ వేడుకల్లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు ఎంపీని సన్మానం చేశారు. బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ అమ్మవారికి పూజలు చేశారు. శ్రావణ్‌కుమార్, కొత్త సత్యం, వేదవ్రత్, బాలస్వామి, రామకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

రాజాపూర్: గ్రామాల్లోని ప్రజల్లో భక్తిభావం పెరిగిందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని చొక్కంపేట్‌లో ఎంపీటీసీ అభిమన్యూరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్మించిన ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీతో పాటు మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణమండపాన్ని ప్రారంభించారు.

మునిరంగస్వామి ఉత్సవాలు


భూత్పూర్‌లో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

అడ్డాకుల: భూత్పూర్ మండల కేంద్రంలో వెలిసిన మునిరంగస్వామి దేవాలయం బ్రహోత్సవాలు గురువారం మొదలయ్యాయి. ధర్మకర్తల నివాసం నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలు, ఆభరణాలను నిర్వాహకులు ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. తర్వాత వాటిని ఆలయం వద్దకు తీసుకు వచ్చి ఆలయ ప్రవేశం చేయించారు. అనంతరం నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బాలానగర్: మండలంలోని మోతీఘణాపూర్‌లో ఉమా మహేశ్వరుల కల్యాణోత్సవం గురువారం కనులపండువగా సాగింది. శివాలయ వారోత్సవాల్లో భాగంగా రెండు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు గణపతిహోమం, సకల దేవతుల పూజలు నిర్వహించిన పండితులు, వారోత్సవాల్లో రెండవ రోజు సకల దేవతల ఆహ్వాన యజ్ఞం, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. దీంతో ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగాయి.

అభివృద్ధే బీజేపీ ప్రభుత్వ లక్ష్యం


భూత్పూర్‌లో మాట్లాడుతున్న శాంతకుమార్

అడ్డాకుల: అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందని పార్టీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్ అన్నారు. భూత్పూర్ పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నరేంద్రమోదీ పాలనలో దేశం వేగంగా అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. ప్రధానమంత్రికి దేశాన్ని అభివృద్ధి చేయాలనే బలమైన సంకల్పం ఉన్నందునే దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతుందని చెప్పారు. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం దేశ ప్రజల మనస్సులను గెలుచుకున్నాయని తెలిపారు. రోడ్లు, రైల్వే, విమానయాన రంగాల్లో మోదీ ప్రభుత్వం అద్భుత పురోభివృద్ధి సాధించిందన్నారు. దేశ ప్రజల లక్ష్యాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తున్న బీజేపీని మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు, రవీందర్‌రెడ్డి, గొడుగు ఆంజనేయులు, రవీందర్, సత్యయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగ పిల్లలకు యంత్రాల పంపిణీ


ట్రైసైకిల్ పంపిణీ చేస్తున్న అధికారులు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో గురువారం నిర్వహించిన ఫిజియోథెరపి క్యాంపులో అర్హులైన దివ్యాంగులకు ఆలీమ్‌కో సంస్థ సహకారంతో ఉచితంగా దివ్యాంగ పిల్లలకు రెండు ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాన్ని ఎంపీడీఓ కాళప్ప, ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్‌నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రతి గురువారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహిస్తామని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఫిజియోథెరఫి డాక్టర్ అక్బర్, ఐఆర్‌పీలు మన్యం, తిరుపతి, సీఆర్‌పీలు శంకర్‌యాదవ్, హర్షకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం


భూత్పూర్‌లో ఉపాధ్యాయులైన విద్యార్థులు

అడ్డాకుల: భూత్పూర్ మండల కేంద్రంలోని సాహితి కాన్సెప్ట్ స్కూల్‌లో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సత్యం, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రేషన్‌కోసం గ్రామస్తుల పాట్లు


బాలానగర్‌లో రేషన్ దుకాణం వద్ద క్యూ కట్టిన లబ్ధిదారులు (ఫైల్)

- 37 పంచాయతీలకు 22 రేషన్ దుకాణాలు
- సరుకుల కోసం కిలోమీటర్లు నడవాల్సిందే...

బాలానగర్: రేషన్ సరుకుల కోసం పలు గ్రామాల ప్రజలు పాట్లు పడుతున్నారు. ప్రతి నెల రేషన్ సరుకుల కోసం కిలోమీటర్ల మేర ఇతర గ్రామాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. మండలంలో మొత్తం 10,634 రేషన్ కార్డులు 37 పంచాయతీలు ఉన్నాయి. ప్రతి నెల సుమారు 2,04,085 కిలోల రేషన్ సరుకులు 22 గ్రామాల పరిధిలో తీసుకుంటుండగా, 15 గ్రామాల ప్రజలు ఉమ్మడి పంచాయతీలకు వెళ్లాల్సి వస్తుంది. ఈ సమస్యలపై పలుమార్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేసినా కొన్ని గ్రామాల్లో మార్పు జరిగినా అన్ని గ్రామాల్లో పరిస్థితి మాత్రం అలాగే ఉంది. మండలంలోని అమ్మపల్లి, నవ్యతండా, మాచారం, ఈదమ్మగడ్డ, జీడిగుట్టతండా, జాలుగడ్డ తండా, ఊటకుంట, వాయిల్‌కుంట తండా, నేలబండతండా, పలుగుమీది తండా, బిల్డింగ్ తండా, చెన్నంగులగడ్డతండా, బోడగుట్టతండా, పెద్దబాయితండా, మన్నెగుడ తండా, పంచాయతీలలోని ప్రజలు ప్రతి నెల రేషన్ సరుకుల ఉమ్మడి పంచాయతీలోని రేషన్‌దుకాణాలకు వెళ్తున్నారు.

రేషన్ కార్డులకు సమానంగా లేని డీలర్లు

గ్రామాల్లో సుమారు 600 రేషన్ కార్డులు, అర్బన్‌లో 1,200 రేషన్ కార్డుల కంటే ఎక్కువ ఉంటే ప్రజల అవసరాల నేపథ్యంలో అదనపు రేషన్ డీలర్‌ను ఏర్పాటు చేయడానికి నిబంధనలు ఉన్నాయి. అయితే బాలానగర్, నేరళ్లపల్లి, హేమాజిపూర్, పెద్దరేవల్లి, చిన్నరేవల్లిలో 600లకు మించి రేషన్ కార్డులు ఉన్నా, ఆయా గ్రామాల్లో అదనంగా రేషన్ డీలర్లను ఏర్పాటు చేయని పరిస్థితి. దీంతో సమీప గ్రామాల ప్రజలకు మాత్రం తిప్పలు తప్పడం లేదు.

4.5 కిలోమీటర్ల పోవాలి



మేము చెన్నంగులగడ్డ తండా, ఎక్వాయపల్లి నుంచి పెద్దయపల్లికి 4.5 కిలోమీటర్లు దూరం వెళ్లి రేషన్ సరుకులు తీసుకువస్తున్నాం. మా గ్రామానికి వచ్చిన కలెక్టర్‌కు కూడా ఈ విషయంపై విన్నవించాం. అయినా పరిస్థితి మారలేదు. గ్రామంలో రేషన్ సరుకులు ఇచ్చేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చూడాలి.

– నర్మద, ఎక్వాయపల్లి

కొన్ని గ్రామాల్లో సరుకులు ఇస్తున్నాం



మండలంలోని గంగధారిపల్లి, నందారం గ్రామాల్లో ఎక్కువరేషన్ కార్డుదారులు, గ్రామాల మధ్య దూరం ఉన్నందున ఆయా గ్రామాలకే వెళ్లి సరుకులు అందజేస్తున్నాం. కొత్త రేషన్ డీలర్ల నోటిఫికేషన్ ప్రక్రియ ఉన్నతాధికారుల పరిధిలోనిది. సమస్యలు ఉన్న గ్రామాల నుంచి వచ్చిన వినతులను ఉన్నతాధికారులకు అందజేసి వారి ఆదేశాలతో దూరంగా ఉన్న గ్రామాలలో రేషన్ సరుకులు అందేలా చర్యలు చేపడుతాం.

– శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్